సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 9 । జనవరి । 2025

న్యూస్‌రీల్

ఇచ్ఛాపురంలో స్వల్ప భూప్రకంపనలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో భారీ శబ్దం చేస్తూ రెండు సెకెన్ల పాటు భూమి స్వల్పంగా కంపించింది. దీంతో నిద్రలో ఉన్న ప్రజలు ఉలిక్కిపడిలేచారు. గతంలో కూడా ఇదే తరహాలో రాత్రిపూట భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

10న జిల్లా హాకీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల హాకీ జట్ల ఎంపికలు ఈ నెల 10న నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా హాకీ అసోసియేషన్ ముఖ్య ప్రతినిధులు జరుగుళ్ల రమేష్, పంచిరెడ్డి అప్పలనాయుడు, ఎస్.మధు, పి.బాలమురళీకృష్ణ, శ్రీనివాసరావు, బి.ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పాత్రునివలస క్రీడామైదానం వేదికగా ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. 2009 జనవరి ఒకటి తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, హాకీ కిట్స్‌తో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94934 30233 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

లాటరీ టికెట్ పేరిట మోసం

టెక్కలి రూరల్: మండలంలోని తెలినీలాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో లాటరీ టికెట్‌ను రూ.1000 చెల్లించి కొనుగోలు చేసింది. రెండు రోజుల తర్వాత ఆమెకు రూ.5లక్షలు లాటరీ తగిలినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. ఆ సొమ్ము కావాలంటే ముందుగా రూ.4999 చెల్లించాలని చెప్పారు. ఆమెను నమ్మించేలా కొన్ని డాక్యుమెంట్లు పెట్టడంతో రూ.4999 చెల్లించింది. తాజాగా బుధవారం సదరు వ్యక్తి మళ్లీ ఫోన్ చేసి మరో రూ.18,500 చెల్లించాలని చెప్పడంతో ఆమె మోసపోయానని గ్రహించి ఫోన్ పెట్టేసింది. బయటకు తెలిస్తే పరువు పోతుందని ఎవరికీ చెప్పడం లేదు. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని టెక్కలి పోలీసులు తెలిపారు.



వైరస్ సోకితే..


అది టెక్కలి జిల్లా ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డు. ఆస్పత్రి సిబ్బంది మాస్కులు, పీపీఈ కిట్లు ధరించి చికిత్సకు సిద్ధమయ్యారు. హెచ్‌ఎంపీ వైరస్ సోకిన వ్యక్తికి చికిత్స అందిస్తున్నారంటూ అటువైపుగా ఎవరినీ రానీయకుండా సిబ్బంది హడావుడిగా కనిపించారు. దీంతో అక్కడున్న వారంతా ఆందోళనకు గురయ్యారు. అయితే కాసేపటికే అదంతా మాక్‌డ్రిల్ అని తెలుసుకుని ఊపిరిపీల్చుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన ఈ మాక్‌డ్రిల్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు, డాక్టర్ లక్ష్మణరావు, మహారాజ్, సిబ్బంది పాల్గొన్నారు. –టెక్కలి రూరల్



సంక్రాంతి సంబరాలు

లావేరు మండలం మురపాకలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ప్రిన్సిపాల్ బి.సుధారాణి ఆధ్వర్యంలో విద్యార్థినులు సంప్రదాయ వేషధారణలు, భోగి మంటలు, గొబ్బెమ్మలు, రంగవల్లికలు, పిండివంటలు, కోలాట ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. – ఎచ్చెర్ల

వార్తాహరులు కాదు.. వసూల్ రాజాలు!



- జర్నలిస్టుల ముసుగులో మోసాలు
- సహకరిస్తున్న కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు
- నగరంలో చెలరేగిపోతున్న వసూళ్ల ముఠాలు
- బెంబేలెత్తిపోతున్న భవన నిర్మాణదారులు
- డబ్బులు ఇవ్వకపోతే పీడీఎఫ్ పత్రికల్లో కథనాలు
- పోలీస్‌స్టేషన్లను ఆశ్రయిస్తున్న బాధితులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

- గోవిందనగర్‌లో మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిని సెట్‌బ్యాక్స్ లేవు అని భయపెట్టి ఓ ముసుగు జర్నలిస్టుల బృందం రూ.30 వేలు వసూలు చేసింది.
- నగరంలోని 80 అడుగుల రోడ్డులో భవనం నిర్మిస్తున్న ఆర్మీ విశ్రాంత ఉద్యోగిని బఫర్ జోన్‌లో నిర్మాణం ఉందని బెదిరించి రూ.5 లక్షలు డిమాండ్ చేశారు.
- కిమ్స్ రోడ్డులోని నాలుగు ఫ్లోర్లలో ఆస్పత్రి నిర్మిస్తున్న వారికి వద్దకు వెళ్లి అనుమతుల్లేవని చెప్పి రూ.1.50 లక్షలు లాగేశారు.
- ఖాజీపేట పంచాయతీ పరిధిలోకి వచ్చే జామితోటలు ప్రాంతంలో లేఅవుట్ వేస్తున్న వ్యక్తిని బెదిరించి రూ.10లక్షలు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో బేరసారాలు సాగుతుండగానే ముసుగు జర్నలిస్టులపై కేసు నమోదైంది.
- పీఎన్ కాలనీలో భవనం నిర్మిస్తున్న ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిని బెదిరించి రూ.70వేలు వసూలు చేశారు.
- కుశాలపురం సమీపంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మించి, షాపు నడుపుతున్నారని బెదిరించి రూ.లక్షా 50వేల వరకు ఆ వ్యక్తి నుంచి పిండేశారు.
- నగరంలోని జీటీ రోడ్డులో ఓ భవనం నిర్మించిన జ్యూయలర్స్ యజమానిని బెదిరించి డబ్బులు దండుకున్నారు.
- శాంతినగర్‌లో కూడా ఓ భవన నిర్మాణ యజమానిని బెదిరించి రూ.30 వేలు పిండేశారు.
- స్థానిక ఏఎస్‌కాలనీలో ఓ నాయీ బ్రాహ్మణుడు తన పొట్ట కూటి కోసం షాపు పెట్టుకుంటే అతన్ని బెదిరించి డబ్బులు అడిగారు.
- సింగుపురం పంచాయతీలో భూవివాదంలో తలదూర్చి భవన యజమానిని బెదిరించారు. వీరి దందాను ఆ భూ యజమానులు అడ్డుకున్నారు. అక్కడ జరిగిన దందా వీడియోలు బయటకి కూడా వచ్చేశాయి. దీనిపై బాధితులు ప్రైవేటు కేసు పెట్టారు.
- ఆ మధ్య ఓ ఎస్సీ మహిళకు సంబంధించిన స్థలంలో కూడా ముఠా రంగంలోకి దిగి బ్లాక్‌మెయిల్ చేసింది. తొలుత రూ.3 కోట్లు కావాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత బేరసారాలు పెట్టి రూ.30 లక్షలకు దిగారు. అప్పటికీ అంగీకరించకపోవడంతో రూ.25 లక్షలు అడిగారు. ఆ మహిళ వారి బెదిరింపులకు తలొగ్గకుండా ఏకంగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎఫ్‌ఐఆర్ కూడా నమోదైంది. **ఇలా చెప్పుకుంటే పోతే ముసుగు జర్నలిస్టుల అక్రమాలు అనేకం..**

శ్రీకాకుళం నగరంలో ఇంటి ప్లాన్లు, లేఔట్‌లకు అనుమతుల్లేవని జర్నలిస్టుల ముసుగులో కొందరు అక్రమ వసూళ్లు చేస్తున్నారు. ఎక్కడెక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయో తెలుసుకుని అక్కడ గెద్దల్లా వాలిపోతున్నారు. ఎవరైనా ఇవ్వకపోతే తమకున్న వాట్సాప్ పీడీఎఫ్ పత్రికల్లో తొలుత ఒక కథనం ప్రచురించడం.. ఈలోగా దారికొస్తారన్న ఉద్దేశంతో తర్వాత కథనంలో మళ్లీ కలుద్దామంటూ ఇండికేషన్‌తో పబ్లిష్ చేసి భయాందోళనకు గురిచేస్తున్నారు. వీరికి కొంతమంది కార్పొరేషన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది కూడా సహాయ పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అనుమతుల ముసుగులో..

అక్రమ నిర్మాణాలను ఏ ఒక్కరూ ప్రోత్సహించకూడదు. అడ్డగోలు నిర్మాణాలపై అడ్డుకట్ట వేయాల్సిందే. దానిని ఎవరూ తప్పు పట్టడానికి లేదు. ఇలాంటి వాటిపై బాధ్యత గల జర్నలిస్టు ఎవరైనా కథనాలు రాయడంలో తప్పులేదు. లోపాలుంటే నిర్మాణదారులు సరిచేసుకుంటారు. అనుమతుల్లో జాప్యం జరిగితే అధికారులను సంప్రదిస్తారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల సలహాతో నిర్మాణాలు చేసుకుంటారు. కానీ, కేవలం కాసుల కోసం అక్రమ నిర్మాణాల పేరిట బెదిరించి వసూళ్లకు దిగడం ముమ్మాటికీ నేరమే.

ప్రధాన పత్రికల పేరుతో..

గుర్తింపు ఉన్న ప్రధాన పత్రికల పేర్లకు చిన్న అక్షరాలతో మరో పేరును తగిలిస్తున్నారు. ప్రధాన పత్రికల పేర్లను పెద్దగా ముద్రించి, ఇవి తమ పత్రికలని చెప్పి దందా సాగిస్తున్నారు. ఇలాంటి పత్రికల్లో కొన్నింటికీ అనుమతులు కూడా లేవు. ఎవరో రిజిస్టర్ చేసుకున్న ఈ పత్రికలు తర్వాత కాలంలో నిలిచిపోతే వాటి పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇలాగే, ఓ చిన్న పత్రిక అసలు యజమాని చనిపోవడంతో అతను పత్రికను తమకు రాసిచ్చినట్లు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించేశారు. అయితే చనిపోయిన వ్యక్తి శ్రీకాకుళం ఆర్డీవోకు తెలియడంతో వీరి గుట్టు రట్టు అయ్యింది. సదరు అధికారి గట్టిగా ప్రశ్నించడంతో కాళ్లావేళ్లా పడి బతిమలాడినట్టు సమాచారం.

కొందరు టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కుమ్మక్కై..



'ముసుగు జర్నలిస్టుల' దందాలకు కొందరు టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూడా సహాయ పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడెక్కడ లోపాలతో నిర్మాణాలు జరుగుతున్నాయో ఈ సిబ్బందే ముసుగు జర్నలిస్టులకు సమాచారమిచ్చి అక్రమ దందా సాగిస్తున్నారు. ముందు ముసుగు జర్నలిస్టులు అక్కడికెళ్లి ప్రశ్నించడం, ఫొటోలు తీయడం.. అక్కడి నుంచే సిబ్బందికి ఫోన్ చేయడం.. ఈలోగా వారొచ్చి మీడియాతో గొడవ పడితే ఇబ్బంది అని, ఎంతో కొంతకు సెటిల్ చేసుకోవాలని సలహా ఇవ్వడం, డబ్బు చేతికందిన తర్వాత వాటాలు వేసుకుని అక్కడి నుంచి పలాయనం చిత్తగిస్తున్నారు.

ట్రూకాలర్‌లో టౌన్‌ప్లానింగ్ అని..

విచిత్రమేమిటంటే ఈ దందాలకు ప్రత్యేక ఫోన్ వాడుతున్నారు. ఆ ఫోన్ నెంబర్లను శ్రీకాకుళం టౌన్ ప్లానింగ్ పేరుతో ఫీడ్ చేసుకుంటున్నారు. ఎవరైనా ట్రూకాలర్‌లో చూస్తే టౌన్ ప్లానింగ్ అని వస్తుంది. దీంతో బాధితులు కూడా టౌన్ ప్లానింగ్ వాళ్లేమో అనుకుని ముసుగు జర్నలిస్టులను నమ్మి మోసపోతున్నారు.

చెట్లు, డివైడర్ల తొలగింపు అనంతరం పాలకొండ రోడ్డు ఇలా..



పండుగ పూట ఇవేం పనులు?





సంక్రాంతి షాపింగ్ సందడితో జిల్లా కేంద్రం కళకళలాడుతున్న తరుణం..
డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు వ్యాపారాలు జోరుగా జరిగే ప్రాంతం..
పవిత్ర పుణ్యక్షేత్రాలు అరసవల్లి, శ్రీకూర్మం వంటి ప్రాంతాలకు భక్త జనం రాకపోకలు సాగించే మార్గం..
ఇక విద్యార్థుల పాఠశాలలు.. ఉద్యోగుల కార్యాలయాలు.. పోలీస్ స్టేషన్లు.. పెద్ద హోటళ్లు..
గుళ్లు గోపురాలు.. ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగించే దారి అది.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

- పాలకొండ రోడ్డులో చెట్ల తొలగింపు చర్యలపై తీవ్ర విమర్శలు
- ఉదయం నుంచి రాత్రి వరకు నరకయాతన పడ్డ వాహనచోదకులు
- నగర పాలక సంస్థ అధికారులపై ప్రజల మండిపాటు



పై విషయం కార్పొరేషన్ అధికారులు మరిచినట్టున్నారు. పాలకొండ రోడ్డులోని సెంటర్ డివైడర్‌పై ఉండే చెట్లతో అనారోగ్య కారణాలు చూపి.. మొత్తం డివైడర్‌తో సహా పచ్చదనంపై ప్రొక్లెయినర్‌తో వేటు వేశారు. వేటు సంగతి అటుంచితే ఆ మార్గంలో రాకపోకలు సాగించే జనం సంగతి గాలికొదిలేశారు. ఒకవైపు పూర్తిగా చెట్లను పెకిలించి.. డివైడర్ గేట్లను తొలగించే పని చేపట్టారు. దీంతో బుధవారం ఆ మార్గంలో ప్రయాణించినవారు ఉదయం నుంచి రాత్రి వరకు నరకం చూశారు. వాహనాలు బారులు తీరాయి. డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలికి చేరేందుకు గంటన్నరకు పైగానే సమయం పట్టిందంటే ప్రజలు అనుభవించిన నరకయాతన ఏంటో ప్రత్యేకంగా వివరించనక్కర్లేదు. అలాగే ఇష్టారాజ్యంగా పనులు నిర్వహించడంతో ఇంటర్‌నెట్, కేబుల్ వినియోగదారులకు అంతరాయం తప్పలేదు.

సమయం చూడరా..

సుందరీకరణ పనులు కావొచ్చు.. చెట్ల తొలగింపు కావొచ్చు.. పని ఏదైనా పండగ వేళే గుర్తొచ్చిందా.. అని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మొన్న ఆమదాలవలసలో ఆక్రమణల తొలగింపు.. నిన్న అరసవల్లిలో దుకాణాల తొలగింపు.. నేడు పాలకొండ రోడ్డులో మొక్కల తొలగింపుతో ప్రయాణికులకు పాట్లు.. అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రథసప్తమి నేపథ్యంలో..

రథసప్తమికి తక్కువ సమయం ఉండడంతో చెట్లు తీయాల్సి వచ్చింది. ఎవరికీ ఇబ్బంది లేకుండా వెంటనే చెట్లు తొలగించే ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజలెవ్వరు ఇబ్బంది పడాల్సిన పనిలేదు.
– పి.వి.వి.డి ప్రసాద్, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్

ప్రత్యామ్నాయం చూపకుండా..

సంక్రాంతి పండుగ వంటి సమయంలో పాలకొండ రోడ్డులో చెట్లు కొట్టేసి రాకపోకలకు ఇబ్బంది కలిగించడం సరికాదు. ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డును ఇలా చేయడం తగదు. ఏ రోడ్డులో వెళ్లినా కనీసం రెండుమూడు గంటలు సమయం పట్టింది.
– ఆర్.సన్యాసినాయుడు, శ్రీకాకుళం నగరవాసి

ప్రత్యామ్నాయం చూపకుండా...

ఆమదాలవలస, పాతబస్టాండ్ వరకు నడిచే ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు సైతం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తాయి. ఈ విషయం అధికారులు మర్చిపోయినట్లుంది. కనీసం నాలుగు చక్రాల వాహనాలనైనా ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లిస్తే కొంత సమస్య ఉండేది కాదు. మిట్ట మధ్యాహ్నం వేళ వాహనదారులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. చిన్నబజారు, ఇల్లిసిపురం వంటి వాటిలో ఇరుకు రోడ్లలో ఉండే వీధుల్లోంచి కొందరు రాకపోకలు సాగిస్తే మరికొందరు పాలకొండరోడ్డు, రైతుబజారు రోడ్లలో గంటల కొద్దీ ట్రాఫిక్‌లో చిక్కి ఇబ్బందులు పడ్డారు.

ఐరన్ ఎత్తుకెళ్లారు..!



డివైడర్ల మధ్య ఉండే పాత ఐరన్ సైతం ఎక్కడికక్కడ వదిలేయడంతో చాలా మంది పట్టుకుపోయారు. అయినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాధనం వృథా అయినా తమకేం పట్టనట్లు వ్యవహరించడం సరికాదని నగరవాసులు మండిపడుతున్నారు.

విద్యుత్ కనెక్షన్ల తొలగింపు..

అరసవల్లికి వెళ్లే మార్గంలో మిల్లు జంక్షన్ వద్ద చిన్న బడ్డీలు, పండ్ల దుకాణాలు, టిఫిన్ షాపులను తొలగించాలని ఆదేశిస్తూ విద్యుత్ కనెక్షన్లను బుధవారం తొలగించారు. ఒక్కసారిగా జీవనాధారం కోల్పోవడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు.

క్లుప్తంగా

ఈనెల 11న మహాధర్నా



ముకుందాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

మెళియాపుట్టి: ఈనెల 11వ తేదీన మండల కేంద్రంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వంకల మాధవరావు తెలియజేశారు. దీనిలో భాగంగా మండలంలోని ముకుందాపురం గ్రామంలో గిరిజన యువతతో కలిసి ద్విచక్ర వాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. గిరిజన గ్రామాలకు వెళ్లి ఐటీడీఏ సాధన, ఆదివాసీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చడం, తదుపరి పోరాటాల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఐటీడీఏ లేకపోవడంతో సమస్యలు చెప్పుకోవాలంటే మన్యం జిల్లా సీతంపేట వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. బైక్ ర్యాలీలో అంపురం, ముకుందాపురం సర్పంచ్‌లు జమ్మయ్య, భాస్కరరావు, గిరిజన నాయకులు గౌరేసు, ఢిల్లీరావు, నూకయ్య, సురేష్, ఆదినారాయణ, అప్పారావు, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో కాంట్రాక్ట్ లెక్చరర్ మృతి



గుంపాన బాబూరావు (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో హిస్టరీ కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న గుంపాన బాబూరావు (58) విధి నిర్వహణలో మృతిచెందారు.. బుధవారం ఉదయం 9.30 గంటలకు డిగ్రీ కళాశాలకు చేరుకున్న ఆయన 11.45 గంటల సమయంలో ఛాతి నొప్పి వస్తుందని చెప్పడంతో తోటి అధ్యాపకులు వెంటనే పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బాబూరావు ఐదేళ్లుగా పాతపట్నం దేవాంగులవీధి నివాసముంటూ కళాశాలకు వెళ్లి వస్తుంటారు. ఈయన స్వగ్రామం అనకాపల్లి జిల్లా సీడికాడ మండలం సరిజం గ్రామం. భార్య గుంపాన రవణమ్మ, ఇద్దరు కుమారులు సింహాద్రి మృత్యుంజయ, మహాదేవుల నాయుడు ఉన్నారు. బాబూరావు మృతి పట్ల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, వైస్ ప్రిన్సిపాల్ కె.చక్రపతి, అధ్యాపకులు సంతాపం తెలిపారు.

మకరాంపురం యువకుడి ప్రతిభ



తమరాల అవినాష్

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన పేదింటి యువకుడు తమరాల అవినాష్ ఒకేసారి రెండు బ్యాంకు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పీఓగా, తెలంగాణా గ్రామీణ బ్యాంకు క్లర్క్ పోస్టులకు ఎంపికయ్యాడు. తండ్రి లక్ష్మణమూర్తి వ్యవసాయం చేస్తూ అనారోగ్యానికి గురై మూడేళ్ల క్రితం మృతిచెందారు. తల్లి జయమ్మ కుమారులు అవినాష్, అభిషేక్‌లను చదివించింది. సోదరుడు అభిషేక్ ఇప్పటికే బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తాజాగా అవినాష్ కూడా ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

అల వైకుంఠ దర్శనం..!

- రేపు ముక్కోటి ఏకాదశి
- ఉత్తర ద్వార దర్శనాలకు వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు
- అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకునే అవకాశం

శ్రీకాకుళం కల్చరల్: ధనుర్మాసంలో అతి పవిత్రమైన రోజు పుష్యమాస ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అంటారు. దీన్నే ముక్కోటి ఏకాదశి అని కూడా పిలుస్తారు. విష్ణు స్వరూపుడైన శ్రీనివాసుడిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుంటే వైకుంఠంలో శ్రీమన్నారాయణుడిని దర్శించుకున్నట్లే. అతి పవిత్రమైన ఈ రోజు కోసం ప్రతీ ఆలయాన్ని ఒక వైకుంఠంగా తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలోని పలు ఆలయాల్లో ఈనెల 10న అతి పవిత్రమైన ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని వైకుంఠ(ఉత్తర) ద్వార దర్శనాలు కోసం ఏర్పాటు చేస్తున్నారు.



కల్యాణ వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో ఉత్తర ద్వారం



కోదండ రామాలయంలో ఉత్తరద్వారం

శ్రీకాకుళం నగరంలో...

- విజయ దుర్గ ఆలయంలో అమ్మవారిని వేంకటేశ్వరస్వామిగా అలంకరించి ఉత్తర ద్వారా దర్శనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ తెలిపారు. సాయంత్రం 10 వేల పుష్పాలతో అర్చన, కల్యాణం చేయనున్నారు.
- పాలకొండ రోడ్డులోని కోదండరామాలయంలో ఉత్తరద్వార దర్శనాలు, సాయంత్రం గోదాదేవి ఊరేగింపు, కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు తెలిపారు. చిన్నబజారులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, అలాగే బ్యాంకర్స్ కాలనీలోని శివబాలజీ ఆలయంలో ఉత్తర ద్వారా దర్శనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు సీతారామాచార్యులు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.
- పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శనాలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. మొండేటి వీధిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తర ముఖంగా స్వామిని దర్శించుకునేందుకు ప్రత్యేకంగా ఉత్తర ద్వారాలను అలంకరించారు.

వజ్ర కవచ దర్శనం



నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనాలు, వజ్రకవచ దర్శనాలు కోసం ఏర్పాట్లు చేశారు. దీనికోసం ఆలయాన్ని పూల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఉచిత క్యూలైన్‌తో పాటుగా ప్రత్యేక దర్శనం క్యూలైన్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా పూలతో అలంకరించి గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామివారిని భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వారా దర్శనాలు ప్రారంభమవుతాయి. అలాగే మూల విరాట్‌ను వజ్రకవచ దర్శనంలో భక్తులు దర్శించుకునే ఏర్పాటు చేస్తున్నారు.

ఎంతో విశేషమైన రోజు



పుష్యమాసంలో వచ్చే ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అంటారు. ఉత్తర ద్వారం ద్వారా దేవతలు కూడా స్వామివారిని దర్శిస్తారు. అలాగే భక్తులు కూడా ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శిస్తే వైకుంఠ ప్రాప్తి కలుగుతుంది.

– జి.శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు



నారాయణ తిరుమలలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

భాస్కరుని దర్శనం



అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులంతా ఆలయ ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశించి స్వామివారిని దర్శించుకునేలా ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో స్వామివారి కల్యాణ ఉత్సవం అనివెట్టి మండపంలో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఉత్తర ద్వారా దర్శన ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

కూర్మనాథాలయంలో..

గార: ఆదికూర్మక్షేత్రం శ్రీకూర్మంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ ఈవో జి.గురునాథరావు, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామన్న సింహాచార్యులు తెలిపారు. వేకువజామున మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, సేవాకాలం తర్వాత గరుడ వాహనంపై గోవిందరాజస్వామి తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకోవచ్చు. ఏడాదికొకసారి జరిగే విశేష ఉత్సవం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. తిరుప్పావై సేవాకాలంతో పాటు విశేష అర్చనలు, అధ్యయనోత్సవములు జరుగుతాయని తెలిపారు.



తగ్గుముఖం పట్టిన డయేరియా

పొందూరు: స్థానిక కస్పావీధిలో మూడు రోజుల క్రితం ప్రబలిన డయేరియ వ్యాధి తగ్గుముఖం పట్టింది. ఈవో మోహన్‌బాబు ఆధ్వర్యంలో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం, సురక్షిత తాగునీరు అందించడం, తాడివలస పీహెచ్‌సీ డాక్టర్ రమేష్‌నాయుడు, సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో వ్యాధి అదుపులోకి వస్తోంది. మూడో రోజు బుధవారం ఇద్దరు మాత్రమే సామాజిక ఆసుపత్రిలో చేరారు. ముందు రోజు చికిత్స తీసుకుని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు. మూడవ రోజు ఎటువంటి కొత్తకేసులు నమోదు కాకపోవడంతో వైద్య, పంచాయితీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, డయేరియా వ్యాధి ప్రబలడానికి కారణమైన పెద్ద చెరువు పరిసరాలలో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు.పనులను డీఎల్‌పీవో వెంకటరమణ పరిశీలించారు. చెరువులో కలుషితమైన చేపలు తినడం వల్లే కస్పావీధిలో 20 కుటుంబాల్లో 22 మంది వరకు డయేరియా బారిన పడ్డారని, ఇకపై ఈ చెరువులో చేపలు పట్టడం, తినడం నిషేధిస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేశారు. అంతకుముందు పొందూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో బాధితులను శ్రీకాకుళం డీసీహెచ్‌ఎస్ కళ్యాణబాబు పరామర్శించారు. ఎపిడిమాలజిస్టు సుజాత, ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సుజాత, వైద్యులు రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న డీసీహెచ్ కల్యాణబాబు

బీసీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : వెనుకబడిన తరగతుల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు లింకేజీతో కూడిన సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ అర్.గడ్డెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత ఉపాధికి సబ్సిడీ రుణాలు, బి-ఫార్మా, డి-ఫార్మా చదివిన నిరుద్యోగులకు జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటుకు రాయితీ రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న తర్వాత ఎంపీడీఓ/మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

- బీసీ కులాల యువతకు సాధారణ అభివృద్ధి రుణాలు కింద 1935 యూనిట్లు మంజూరు చేస్తారు. స్లాబ్-1 రకం యూనిట్ విలువ రూ.2 లక్షలు లోపు ఉంటుంది. సబ్సిడీ రూ.75వేలు. స్లాబ్-2 రకం రూ.2లక్షలు నుంచి రూ.3 లక్షలు. సబ్సిడీ రూ.1.25 లక్షలు. స్లాబ్-3లో యూనిట్ విలువ రూ.3 లక్షలు నుంచి రూ.5 లక్షలు. సబ్సిడీ రూ.2 లక్షలు. మిగిలిన మొత్తం బ్యాంకు నుంచి పొందాల్సి ఉంటుంది.
- బీసీలకు జెనరిక్ మందుల షాపు ఏర్పాటుకు(బీ-ఫార్మా, డీ-ఫార్మా) 55 యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. యూనిట్ విలువ రూ.8 లక్షలు. సబ్సిడీ రూ.4 లక్షలు.
- ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కులాలు(ఈబీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య) స్వయం ఉపాధికి 41 యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.వీటికి 50 శాతం సబ్సిడీ ఉంటుంది. వీరు జనరిక్ మెడికల్ షాపులు(8 యూనిట్లు) పెట్టుకుంటే 50 శాతం సబ్సిడీ ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





ప్రమాదస్థలంలో వెంకటరమణ మృతదేహం

పొందూరు: మండల కేంద్రంలోని నాయుడువీధికి చెందిన నల్లి వెంకటరమణ(49) అల్లూరి జిల్లా పాడేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు విజయనగరంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న నల్లి వెంకటరమణ పాడేరులో ఏపీఎస్‌బీ హెచ్‌సీగా పనిచేస్తున్నారు. బుధవారం విధులు ముగించుకుని బైక్‌పై విజయనగరం వచ్చేందుకు సిద్ధపడిన వెంకటరమణ పాడేరు రోడ్డుపై కూరగాయలు కొనుగోలు చేశారు. అయితే ఆ సమయంలో వెనుకనుంచి ఎవరో పిలిచినట్లు అనిపించడంతో బండిపై వెనుకకు తిరిగారు. అప్పుడే అతివేగంగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం బలంగా ఢీకొనడంతో బైక్‌తో పాటు కొద్ది దూరం ఎగిరి రోడ్డుపై పడ్డాడు. రోడ్డుకు తల బలంగా ఢీకొనడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి ఉద్యోగులు, స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అందరితో మంచిగా ఉండే వెంకటరమణ మృతి చెందడంతో పొందూరు పట్టణంలోని నాయుడువీధిలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య పద్మ, సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్న కుమార్తె, ఇంజినీరింగ్ చదివిన కుమారుడు ఉన్నాడు. అంత్యక్రియలు నిమిత్తం మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చారు.

అన్యాయంగా తొలగించారు

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూలో పనిచేస్తున్న తమను అన్యాయంగా తొలగించారని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేవారు. 34 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈనెల 2వ తేదీన అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అజయ్ కార్తీక్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం మూడు పార్టీలకు సంబంధించిన వ్యక్తులు విచారణకు హాజరవ్వాలని ఆయన నోటీసులు జారీ చేశారు. వర్సిటీ వీసీ రజిని, రిజిస్ట్రార్ సుజాత, ఏజీఎస్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కంట్రోలర్ రూపేష్‌బాబు, ఫిర్యాదు చేసిన బాధితులు హాజరవ్వాలని స్పష్టం చేశారు. దీంతో శ్రీకాకుళం డే అండ్ నైట్ కూడలి సమీపంలో ఉన్న కార్యాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. అయితే ఈ విచారణకు వర్సిటీ తరుపున అధికారులు హాజరవ్వలేదు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన అవుట్ సోర్సింగ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, ఉద్వాసనకు గురైన బాధితులు తమ వివరణ తెలియజేశారు. అనంతరం విచారణ ఈనెల 24కు వాయిదా వేశారు.



విచారణ చేపడుతున్న దృశ్యం

జిల్లా పరిషత్ బడ్జెట్ రూ. 1580.59 కోట్లు

అరసవల్లి: జిల్లా పరిషత్ ఆదాయ, వ్యయాల ఆధారంగా 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్ ప్రతిపాదనలకు ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సీఈవో ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా సమక్షంలో సంబంధిత అకౌంట్స్ ఏఓ రామేశ్వరరావు పటాన్నయక్ బడ్జెట్ ప్రతిని సమావేశంలో చదివి వినిపించారు. 2024-25 సవరణ బడ్జెట్ ఆదాయం రూ.1411,54,99,739 కాగా, వ్యయంరూ.1306,32,44,486 గానూ మిగులుగా రూ.105,22,55,253గా పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్‌గా ఆదాయం రూ.1580,59,07,806 కాగా, వ్యయం రూ.1462,20,29,241, మిగులుగా రూ.118,38,78,565గా చూపించి ప్రతిపాదించారు. దీనిపై అభ్యంతరాలు, వివరణలు రాకపోవడంతో హాజరైన సుమారు 18 మంది జెడ్పీటీసీలు బల్లలు చరిచి ఆమోదాన్ని తెలియజేశారు. 2025-26 అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రకటించారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ తదితర ఐదు విభాగాలతో పాటు జిల్లా పరిషత్‌కు వస్తున్న ఆదాయ, వ్యయాలను అంచనాలు వేసి ఇంత మొత్తంలో బడ్జెట్‌ను రూపొందించినట్లు సీఈవో తెలిపారు. సీనరేజి ఫీజు, సర్‌చార్జి ఆన్ స్టాంప్ డ్యూటీ, రూ.4 చొప్పున తలసరి ఆదాయంతో పాటు అద్దెలు-ఇతరత్రా మార్గాల ద్వారానే జెడ్పీకి రాబడి రానుందని, ఈ మేరకు అధికారులు కృషి చేయాలని చైర్‌పర్సన్ సూచించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 1వ జెడ్పీ స్థాయి సంఘ సమావేశం కూడా జెడ్పీ అధ్యక్షురాలి అధ్యక్షతన నిర్వహించారు.



బడ్జెట్ ఆమోదంపై మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, చిత్రంలో సీఈవో శ్రీధర్ రాజా

సిక్కోలు విద్యార్థులు అదరహో..

- జాతీయస్థాయి సైన్స్ పోటీలకు రెండు ప్రాజెక్టులు ఎంపిక
- సింగిల్ స్టూడెంట్, గ్రూప్ స్టూడెంట్స్ కేటగిరిల్లో రాణింపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యార్థులు మరోసారి ఆకట్టుకున్నారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడ వేదికగా ఈ నెల 7,8 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో జిల్లా నుంచి సింగిల్ స్టూడెంట్, గ్రూప్ స్టూడెంట్స్, టీచర్ కాన్సెప్ట్ మూడు కేటగిరీల్లో రెండేసి ప్రాజెక్టుల చొప్పున మొత్తం ఆరు ప్రాజెక్టులు ప్రాతినిధ్యం వహించాయి. సింగిల్ స్టూడెంట్ విభాగంలో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జశ్వంత్ పాత్రో రూపొందించిన 'పునరుత్పాదక బ్రేకుల వ్యవస్థ' ప్రాజెక్టు, సంతబొమ్మాళిలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ఎ.దీపక్, ఎ.శివహరీష్ రూపొందించిన 'సుస్థిత వాననీటి నిర్వహణ' జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్-2024 పేరిట పాండిచ్చేరి వేదికగా ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న పోటీల్లో ఈ రెండు ప్రాజెక్టులు ప్రాతినిధ్యం వహించనున్నాయి. విద్యార్థులను, గైడ్ టీచర్లను, జిల్లా సైన్స్ అధికారి ఎస్.కుమారస్వామిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎ.తిరుమల చైతన్య, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్, డీవైఈఓలు ఆర్.విజయకుమారి, విలియమ్స్, అసిస్టెంట్ కమిషనర్ లియాకత్ ఆలీఖాన్, జి.రాజేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.



బహుమతులు అందుకుంటున్న దీపక్, శివహరీష్



బహుమతి అందుకుంటున్న జశ్వంత్ పాత్రో

'సుస్థిర వాననీటి నిర్వహణ'తో వర్షపునీరు నిల్వ..



సంతబొమ్మాళిలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులను ఎ.దీపక్, ఎ.శివహరీష్‌లు 'సుస్థిత వాననీటి నిర్వహణ' పేరిట ప్రాజెక్టు రూపొందించారు. గైడ్‌టీచర్‌గా పీజీటీ ఫిజికల్ సైన్స్ టీచర్ ఎ.సుధ వ్యవహరించారు. భూగర్భంలో గ్రౌండ్‌వాటర్‌గా నిల్వచేసి, ట్యాంకుల్లో నిల్వచేసి, అవసరమైనప్పుడు వర్షపునీరుని తాగడంతోపాటు వివిధ రకాల పనులకు ఉపయోగించవచ్చని నిరూపించారు.

'పునరుత్పాదక బ్రేకుల వ్యవస్థ'తో విద్యుత్ నిల్వ..



పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జశ్వంత్ పాత్రో 'పునరుత్పాదక బ్రేకుల వ్యవస్థ' పేరిట ప్రాజెక్టును తీర్చిదిద్దాడు. ఫిజికల్ సైన్స్ టీచర్ జె.షన్ముఖరావు గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. మెకానికల్ ఎనర్జీని ఎలక్ట్రిక్ ఎనర్జీగా ప్రాజెక్టుతో కన్వర్ట్ చేయవచ్చని జశ్వంత్ నిరూపించాడు. దీనివల్ల విద్యుత్ నిల్వ, పొదుపు, ఖర్చు, కాలం ఆదా అవుతాయి. ముఖ్యంగా గ్లోబల్ వార్మింగ్ తగ్గుతుందని నిరూపించారు.